14

# ఎవరు... ఎవరు?

పితృదేవో భవ...,

దేవునిలాంటి నాన్న...,

గురువై, స్నేహితుడై, హితుడై తనను నడిపించవలసిన నాన్న,

కరుగుతున్న మైనంలాంటి మనసు ఓ నిర్దుష్టమైన ఆకారాన్ని సంతరించుకోబోతున్న కీలక తరుణంలో..,

ఆ రోజు రాత్రి..,

"రేపు నువ్వు ఎస్.ఎస్.సి. పరీక్ష హాల్లోకి పోయి కూర్చున్న గంటకి మొత్తం జవాబులున్న కాగితం నీ దగ్గరకొస్తుంది. చకచకా రాసెయ్యి.." అని శాసించిన క్షణం,

బిక్కమొగమేసి-

ఏదీ పాలుపోని నిస్సహాయతలో తన్నుకుని తన్నుకుని, నిశ్శబ్దంగా పరీక్షా హాల్లోకి నడిచిన క్షణం...

కిటికీలోనుంచి దూరంగా కనబడ్తోంది.. నాన్న తాలూకు... పోలీసు జవానులతో, జరుపుతున్న మంతనాలు... తలలూపుడు... జవాను రావడం... కిటికీ దగ్గర నిలబడి అతి బహిరంగంగానే నా చేతిలో కాగితాలనుంచి "మీ ఇంగ్లీష్ మాస్టారే స్వయంగా నాన్నగారి అఫీసులో కూర్చుని జవాబులు రాసి పంపించారు.అన్నీ కరెక్టే- రాసేయ్ పరపరా" అని అంటున్నప్పుడు.

కావాలని బయటికి చూస్తున్నట్లు కనబడ్తున్న ఇన్విజిలేటర్..,

చుట్టూ మా నాన్న పాదాలకు, పవర్‌కు సలాం చేస్తున్న వాతావరణంలో...

పెన్ను కదలక... కన్నీళ్ళు నిండిన కళ్ళకు చిట్టీల్లోని అక్షరాలు కనబడక, భయంతో, అవమానంతో ఏమీ రాయలేని నేను ఒట్టి తెల్లకాగితాన్ని యిచ్చి వచ్చిన రాత్రి...,

నాన్న...బెల్టుతో కొట్టి...చర్మంపై ఎర్రగా వాతలు తేలేట్టు వాయించి,

చిన్ననాటినుండీ... వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌గా వాహనాలను ఏలే రాజ్యంలో.. ఎందరెందరు ఎన్ని కానుకలను మా యింటికి పంపుతారో, ఎందరెందరు ఎన్ని నోట్ల

కట్టలనిచ్చి పోతారో... ఎన్ని విందుల మజాలు మా ఇంట్లో జరిగి పోతాయో, ఎంతమంది అమ్మాయిలు ఎవరెవరితోనో ఏ రాత్రో వచ్చి కిలకిల్లాడుతారో... అన్నీ చూచి చూచి,

ఏదో చిన్ననాడు... నా స్నేహితులకంటే అన్ని సదుపాయాలున్న నేను రవ్వంత ఆనందం పొందినా... వయసు పెరుగుతున్న కొద్దీ మనసులో ప్రశ్నలు మొలవడం ప్రారంభమై,

"నేనీ పరీక్ష రాయను... నాకు చదువుమీద శ్రద్ధ లేదు. నేను మళ్ళీ నీలా ఓ దొంగను కాదల్చుకోలేదు" అని అన్న రాత్రి..,

నా మనసులో ఓ బాంబు పేలి.... తుఫాను రేగి, మళ్ళీ దెబ్బలకు చర్మం చిట్లి.. రక్తం కారి... తప్పనిసరి పరిస్థితుల్లో కన్నతండ్రి అందించిన కాపీలను కొట్టి,

పరీక్ష ఏమీ రాయకుండా నేనిచ్చిన

తెల్ల ఆన్సర్ బుక్ ఎక్కడ పోయిందో,

నాన్న ఫస్ట్‌క్లాసులో నా నంబర్ వేయించుకు వచ్చిన దినం,

ఈ దేశం కొద్ది కొద్దిగా అర్థంకావడం మొదలైంది.

తర్వాత చదువనని ఎంత గింజుకుంటున్నా పాలిటెక్నిక్‌కు అప్లయ్ చేయించి,

సీటు రాదని తెలుసు. నాకు తెలుసు.... నాన్నకు తెలుసు. నా మార్కులు తెలిసిన ప్రతివారికీ తెలుసు.

కాని ఎక్కడివో ఓ దొంగ స్పోర్ట్స్ సర్టిఫికెట్‌ను సృష్టించి... నన్నొక రాష్ట్రస్థాయి క్రీడాకారునిగా చూపించి, స్పోర్ట్స్ కోటాక్రింద ఎల్.సి.యి.లో సీటు సంపాదించుకుని విజయ గర్వంతో విషపునవ్వు నవ్వుతూ వచ్చిన క్షణం,

ఎంత కృంగిపోయానో,

నా వంతుకు న్యాయంగా సీటు రావాల్సిన ఓ నిజమైన క్రీడాకారునిపై జాలిపడ్తూ...

నాన్నను ఎదిరించలేని అసమర్థత, పిరికితనం... అధైర్యం,

మౌనంగా పొందే ఘర్షణలో -

ఏమీ చదువకపోయినా, లెక్చరర్లపై నాన్న పలుకుబడి... లంచాలు... కానుకలు, విందులు...

పైరవీల రెక్కలపైనుండి దిగివచ్చే మార్కుల పరంపర,

ఏమీ రాని నాకు వద్దు ఈమార్కులు.

ఏమీ తెలియని నాకు వద్దు ఈ డిప్లొమాలు.

నేనీ మోసం, దగా అకృత్యం చేయలేను.

ఎవడింటాడు నా ఘోష....

మెడలు వంచి తలపై బండవంటి, పర్వతం లాంటి సర్టిఫికేట్ నెత్తుతున్నారు.

విడిచిపెట్టండి నన్ను. ఈ కుళ్ళిన విద్యాసంస్థల నుండి ఈ పైరవీల కంపునుండి, ఈ దగాకోరు చదువుల నుండి... నోట్లతో దొరికే సర్టిఫికేట్ల దౌర్భాగ్యం నుండి,

ఊహుఁ... ఒట్టిగా...పూర్తి ఒట్టిగా....నా ప్రమేయం లేకుండానే,

మూడేళ్ళు దాటుతూనే డెబ్బయి రెండు శాతంతో డిస్టింక్షన్ వచ్చి, చేతిలో సర్టిఫికేట్ ... మెడచుట్టూ పాములా,

"ఇప్పుడు నువ్వు బంగారు గుడ్లు పెట్టే బాతువిరా" అని నాన్న పరమ వికారంగా పైప్‌ను వెలిగించుకుంటున్న క్షణం.

కాపాడండీ దేశాన్ని నా బారినుండి, ఏమీ రాని నేను ఓ ఇంజనీర్‌నై, రోడ్లను, భవనాలను, కాలువలను, ప్రాజెక్టలను నిర్మిస్తుంటే అవి కొట్టుకుపోతూంటే, కూలిపోతూంటే రేపు శిక్షించి, నన్ను దండించి దేశాన్ని రక్షించండని ఎలుగెత్తి అరవాలనిపించిన రాత్రి...,

మౌనంలో...,

మళ్ళీ నా దౌర్భాగ్యపు మూగతనంలో హృదయం కనలి కనలి -

ఒట్టి నిస్సహాయంగా నిలబడ్డప్పుడు,

నాన్న పి.డబ్ల్యు.డి. నుండి సూపర్‌వైజర్‌గా ఆర్డర్ పట్టుకొచ్చాడు.

ఇంటర్వ్యూ లేదు. సెలక్షన్ లేదు - ఏమీ లేదు.

నాకంటే మూడేళ్ల ముందు పాసై రోడ్లపై తిరుగుతున్న ఎవరికి రాని ఉద్యోగం... నాకు వచ్చి,

కార్లో తీసుకెళ్ళి... ఎవరో ఎ.ఇ.కి. పరిచయం చేసి,

ఉద్యోగానికి జాయినింగ్ రిపోర్ట్ యిప్పించి "బ్రతకడం నేర్చుకో" అని ఉపదేశంచేసి వెళ్తున్న నాన్నను అసహ్యంగా చూస్తూ, నన్ను నేనే తిట్టుకుంటూ,

నాలా కాపీలుకొట్టి పాసైన వాళ్ళు పలుకుబడులతో, పైరవీలతో, ఇంజనీర్లయి, డాక్టర్లయి, గుమాస్తాలై, లెక్చరర్లయి ఏం చేస్తారీ దేశాన్ని.

పాఠం చెప్పరాని పంతులు మరో దొంగను సృష్టించి,

తను చేయాల్సిన వృత్తి ధర్మాలు తెలియని వాడు ప్రభుత్వ ఆస్తులను నాశనం చేసి, ప్రజల ప్రాణాలు తీసి...

యిలాంటి చెత్తంతా దేశంనిండా అల్లుకుపోయి, ఏమౌతుందీ దేశం చివరికి... ఎవరు ప్రక్షాళన చేస్తారు దీన్ని-

డ్యూటీలో చేరి పది రోజులైన తర్వాత-

"ఎ.ఇ.గారు పిలుస్తున్నారు మిమ్మల్ని" అని బంట్రోతు చెప్తే,

వెళ్ళి అసిస్టెంట్ ఇంజనీర్ ఎదుట గాడిదలా నిలబడి,

"101 స్టోన్‌నుండి 103 స్టోన్ వరకు బి.టి. రోడ్ ఫినిష్షైనట్టు చెక్ మెజర్ వేసి బిల్లు పంపించండి" అన్నాడు.

"అసలా రోడ్డు పని ప్రారంభం కాలేదు గదండీ."

"మాకు తెలుసులేవోయ్. సి.యి.గారు ఇన్‌స్పెక్షన్ కొస్తున్నారు. అతనికో బ్రహ్మాండమైన పార్టీ యివ్వాలి. కనీసం ఏడెనిమిది వేలైనా ఔతుంది. నువ్వా రిపోర్టు ఇస్తే కాంట్రాక్టర్ రామనాథం ఓ లక్షరూపాయల బిల్లు డ్రా చేసి తనే పార్టీ ఏర్పాటుచేస్తాడు. నువ్వు చెప్పినట్టు చెయ్. పో" అని కసురుకున్నాడు.

తర్వాత అర్థమైంది...,

ఎ.యి, వానిపైనున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇద్దరూ కలిసి రామనాథం అనే వ్యక్తి పేర తామే కాంట్రాక్ట్ చేస్తున్నారని,

కొత్త ఉద్యోగం...కొత్త అనుభవం... దాంట్లో ఏమీ తెలియనితనం,

ఆరోజు రాత్రి నాన్న ఒత్తిడి-

బిల్లు పంపించాను... అసలే నామరూపాలు లేని రోడ్డు తయారై బ్రహ్మాండంగా ఉందని.

క్షణాల్లో బిల్లు ఎ.యి.నుండి ఇ.ఇ.కి... అటు నుండి అకౌంటెంట్‌నుండి పాసై... లక్ష రూపాయలు డ్రా ఐ-

ఆ రోజు రాత్రే...

చీఫ్ ఇంజనీర్ రాక... పార్టీ.

ఎ.యి.గారు అన్నీ తానే ఐ ఏర్పాటుచేశారు. చికెన్లు, చేపలు, సీసాలు, స్కాచ్‌లు.

పార్టీలో,

సి.యికి ఇ.ఇలు మస్కా, ఇ.ఇ.లకు ఎ.యిలకు మస్కా, ఎ.యిలకు సూపర్‌వైజర్ల సేవలు, సూపర్‌వైజర్లకు వర్క్స్ ఇన్‌స్పెక్టర్లు గులాంగిరీ,

ఈ ఉద్యోగ వలయమంతా ఒకనికొకడు సుత్తెలు కొట్టుకోవడంలో మనిషి కంపుకొడ్తూ,

కృత్రిమమైన నవ్వులు, ఒట్టి పెదవులపైనుండి పలకరింతలు, వెకిలిప్రేమలు,

అసహ్యం...అసహ్యం... అసహ్యం.

మనస్సులో గుండుసూదిలా ఏదో గుచ్చుకుంటోంది. లేని రోడ్డు ఉన్నదని తనిచ్చిన సర్టిఫికేట్, లక్ష రూపాయలు డ్రా.

ద్రోహం.. దేశ ద్రోహం. భరించరాని, సహించ లేని దేశ ద్రోహం.

దేశ ద్రోహి తను-

ఎలా... ఎంత తప్పుచేశాడు తను.

చిన్ననాటి నుండి తను తప్పులే చేస్తున్నాడు. నాన్న కాపీ కొట్టమన్నప్పుడు భయపడి కాపీ కొట్టి తప్పు చేశాడు. తర్వాత ఒట్టిగా సర్టిఫికేట్ ఇప్పిస్తే కిమ్మనకుండా తీసుకుని తప్పు చేశాడు తను. తనకంటే ముందు పాసైన ఎందర్నో కాదని దొడ్డిదారిన ఉద్యోగం ఇప్పిస్తే మౌనం వహించి దాంట్లో చేరి తప్పు చేశాడు...

కాని... ఆ తప్పులకు ఒక్క తనే బాధ్యుడై తనొక్కడే బాధపడ్డాడిన్నాళ్ళు. కాని యిప్పుడు తన మూలంగా ఈ ప్రజలు, ఈ దేశం, ఈ వ్యవస్థ దెబ్బతినబోతోంది.

సర్దుకోవాలీ తప్పును. దిద్దుకోవాలీ తప్పును. లేకుంటే విషపు ఊటలా యిదీ సమాజాన్ని రోగగ్రస్తం చేస్తుంది.

చటుక్కున ఐడియా వచ్చింది. చకచకా ఓ కాగితం తీసుకుని రాయటం ప్రారంభించాను. ఆ స్థితిలో ఇంతకన్నా నా కసి దీర్చుకోవడానికి వేరే మార్గం కనిపించలేదు.

గౌరవనీయులైన చీఫ్ ఇంజనీర్ గార్కి !

నమస్కారం,

మీరు ఇన్‌స్పెక్షన్‌కు వచ్చిన ఈ జోన్‌లోని మల్లవరప్పాడు రోడ్ 101 నుండి 103 కిలోమీటర్ వరకు బి.టి.రోడ్ వేయబడ్డట్టు ఈ రోజే లక్షరూపాయల బిల్లు డ్రా ఐంది. ఐతే నిజానికి ఆ రోడ్డు నామరూపాలే లేవు. అసలా రోడ్డు నిర్మించబడ లేదు. మీరు దయతో రేపు ఈ ప్రాంతాన్ని ఇన్‌స్పెక్ట్ చేసి ఈ అకృత్యానికి బాధ్యులైన నన్ను, ఎ.యి, ఇ.ఇ.లను సస్పెండ్ చేస్తారని ప్రార్థిస్తున్నాను.

భవదీయుడు,

శ్రీనివాసరావు.

సూపర్‌వైజర్.

నేనే వెళ్ళి స్వయంగా సి.యి. గార్కి ఉత్తరం అందించి వచ్చి అతని రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నాను.

ఐదారు నిముషాల తర్వాత సి.యి. గారు ఓ గదిలోకి వెళ్ళి కూర్చుని నాకోసం కబురు చేశారు.

మనసంతా ఆనందంతో నిండిపోయింది.

ప్రాయశ్చిత్తం జరుగబోతోంది.

అనర్హుడనైన నా ఉద్యోగం పోవడమే కాకుండా మరో ఇద్దరు అవినీతిపరులు శిక్ష పొందబోతున్నారు.

వెళ్ళాను ఉద్వేగంతో.

చీఫ్ ఇంజనీర్ గారు కుర్చీలో గంభీరంగా కూర్చుని ఉన్నారు.

"నువ్వేనా శ్రీనివాసరావు?"

"ఔన్సార్"

"ఎన్ని రోజులైంది ఉద్యోగంలో చేరి."

"పది రోజులు".

"ఆర్.టి.ఓ వైద్యనాథ్ కొడుకువు కదూ నువ్వు"

"ఔన్సార్."

"కుర్రాడివి. బ్రతకడం నేర్చుకో. ఒట్టొట్టిగా ఆవేశపడకు. నువ్వెళ్ళొచ్చు" సిగరెట్టు వెలిగించుకుంటున్నాడు తాపీగా.

బయటికొచ్చాను...

తలలో డైనమైట్లు పేలుతున్నాయి.

క్రిందినుండి పై వరకు మొత్తం అవినీతిమయమై, విషపూరితమై, రోగ గ్రస్తమై ఉందీ వ్యవస్థ. ఎక్కడుంది దీనికి మూలం? ఎక్కడుంది దీని వేరు? ఎక్కడినుండి ప్రారంభించాలి దీని ప్రక్షాళన?

ప్రశ్నలు...ప్రశ్నలు... మెదడునిండా ప్రశ్నలు..

ఏదీ జవాబు

నడుస్తున్నాను.. నడుస్తున్నాను... నడుస్తున్నాను.

ఇంటి వాకిట్లో అడుగు పెట్టగానే-

"కంగ్రాచ్యులేషన్స్ మై బాయ్... నీ మొట్టమొదటి సంపాదనను మీ ఎ.యి. గారు నాకు పంపించారోయ్. లక్షలో నీ పర్సంటేజ్... నాల్గు వేలు..." అంటున్నాడు నాన్న నవ్వుతూ.

ప్రశ్నకు జవాబు దొరికింది.

నాన్నకు దగ్గరగా...యింకా దగ్గరగా నడచి... మౌనంగా రుద్రునిలా... చూచి,

చెళ్ళుమంది ఆయన చెంప... నాన్న చెంప.

మళ్ళీ చెళ్...చెళ్..చెళ్...

చేతులు మండుతున్నాయి.

కాని హృదయం చల్లారుతోంది.

ఇరవై నాలుగేళ్ళ తర్వాత తలెత్తుకుని వెళ్తున్నాను ఇంట్లోకి కళ్ళనిండా నీళ్ళతో. తప్పు చేయడం మానేసినందుకు మనసు చెప్పలేనంత తేలిక పడుతోంది.

'పల్లకి' వారపత్రిక

07.06.1984